క్లుప్తంగా

కిటకిటలాడిన బల్లిగిరి దేవాలయం



శ్రీదేవి, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరుని పూజిస్తున్న భక్తులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము 5 గంటల నుంచి స్వామి వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, ఆరాధన, భక్తుల గోత్రనామాలతో ధనుర్మాస అర్చనలు, తిరుప్పావై సేవాకాలం, నివేదన, మంగళాశాసనం, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. ఆలయ మండపంలో శ్రీదేవీ, భూదేవీ సమేత బల్లిగిరి వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో అవగాహన బోర్డుల ఏర్పాటు



కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన బోర్డులు

మహారాణిపేట : కేజీహెచ్ రోగులు, వారి సహాయకుల హక్కులు, బాధ్యతలు తెలియజేసే బోర్డులను శనివారం ఏర్పాటు చేశారు. వీటితో పాటు పలు చట్టాల గురించి తెలిపే బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. వీటిని రోగులు, వారి సహాయకులు గమనించాలని కేజీహెచ్ వైద్యులు తెలిపారు.

ఆకట్టుకున్న సాహిత్య గోష్టి

మహారాణిపేట : విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో శనివారం సాయంత్రం నిర్వహించిన నేనూ–ఒక కథ ఇష్టాగోష్టి ఆలోచన రేకెత్తించింది. అరసం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని మహిళా చేతన నాయకురాలు కత్తి పద్మ పర్యవేక్షించారు. రచయిత్రులు కల్లూరి శ్యామల, కె.ఎస్.మల్లీశ్వరి, అయ్యగారి సీతారత్నం, గూడూరు సీతామహాలక్ష్మి, మహిళా సంఘాల నాయకురాళ్లు లక్ష్మి లలితా, అన్నపూర్ణ, సాయి పద్మ, మాలిని స్పందిస్తూ వాస్తవం నుంచి ఉద్భవించిన కథలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మధుసూదన్, సత్యనారాయణ, రాజు, శ్యాంసుందర్, మేడా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అల్లిపురం గౌరమ్మ సంబరం

అల్లిపురం : వేంకటేశ్వరమెట్ట, శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా శనివారం గౌరమ్మ సంబరం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం అల్లిపురం, వేంకటేశ్వరమెట్ట, బృందావన్, కెప్టెన్ రామారావు జంక్షన్, మెయిన్‌రోడ్డు, బంగారుమెట్ట, నీలమ్మ వేపచెట్టు ప్రాంతాల్లో తిరువీధి నిర్వహించారు. గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి శరగడం మోహనరావు, కొయిలాడ త్రినాథ్ ఉత్సవాలను పర్యవేక్షించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట : విశాఖ జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, ఏపీ వ్యవసాయ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు వి.విజయప్రసాద్, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. అన్నదాత భవన్ కార్యాలయంలో సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షురాలిగా డి.మాణిక్యాంబిక, ఉపాధ్యక్షుడిగా వై.విఠల్ కిషోర్, కార్యదర్శిగా బి.నర్సింహ నాయక్, కోశాధికారిగా బి.శివకోమలి, సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.





ప్రతి ఆదివారం భక్తుల రద్దీ ఇలా..



పుట్టబంగారం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ప్రగతి కాంతులు

ఎర్నిమాంబ ఆలయానికి నూతన శోభ



ఇది కదా అభివృద్ధి

దశాబ్దాల క్రితం వెలసిన ఎర్నిమాంబ అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్నారు. తొలుత రోడ్డు పక్క చిన్నగా మొదలైన అమ్మవారి ఆలయం తర్వాతి రోజుల్లో క్షేత్రంగా రూపొందిందింది. ఇటీవల దాత వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ రూ. 33 లక్షల సొంత నిధులతో ఆలయం మరింత అందంగా రూపుదిద్దుకుంది.

- కొత్తగా గోపురం, మండపాల నిర్మాణం, గ్రిల్స్, వాల్‌టైల్స్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలి బీఆర్‌టీఎస్ రహదారిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారు జ్ఞానాపురం, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా కొలువై ఉన్నారు. దశాబ్దాల చరిత గల ఈ ఆలయ అభివృద్ధిలో భాగంగా కొత్త కట్టడాలు, నిర్మాణాలు పూర్తి చేశారు. ఆలయానికి చెందిన ఆర్చి, భక్తుల కోసం ప్రత్యేక దర్శనాల క్యూలైన్లు నిర్మించారు. తలనీలాలు సమర్పించేందుకు షెడ్ నిర్మాణం, కొబ్బరికాయలు కొట్టేందుకు ప్రత్యేక కౌంటర్ నిర్మాణం జరిగింది. ఆలయ పునర్నిర్మాణం తర్వాత భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఏటా మే నెల మూడో శనివారం తొలేళ్ల సంబరం, ఆదివారం వైభవంగా జాతర నిర్వహిస్తారు. ఏనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్నప్పుడు అప్పటి భక్తులు అమ్మవారికి చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లుండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లేందుకు ప్రజలు భయపడేవారు. గత నలభై ఏళ్లుగా జనావాసాలు పెరగడంతో రోడ్లు విస్తరింపబడ్డాయి.



జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారు

ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. ఈ విధంగా రోడ్లు విస్తరించడంతో అమ్మవారి భక్తులు పెరిగారు.

పక్క జిల్లాల నుంచి కూడా భక్తులు..

విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు అమ్మవారి దర్శనార్థం వస్తుంటారు. 2007లో భక్తులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు. అప్పటి నుంచి అమ్మవారికి సేవలందించాలనే ధ్యేయంతో జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన స్థానికులు సేవలందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అమ్మవారి ఆలయాభివృద్ధి వేగం పుంజుకుంది. ఆలయ గోపురం, మండప నిర్మాణం, పుట్టబంగారం షెడ్, తలనీలాల షెడ్, గర్భగుడికి హంగులు, మండపాలకు ఎస్ఎస్ గ్రిల్స్, ఫ్లోర్, వాల్ టైల్స్, క్యూ లైన్ల గేట్లు ఏర్పాటు చేశారు. ఆలయానికి అందంగా రంగులు వేసి చూడముచ్చటగా తీర్చిదిద్దారు.

ఆడారి ఆనంద్ నిధులతో మరింత శోభ..

ఎర్నిమాంబ అమ్మవారి ఆలయాన్ని విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ రూ. 33 లక్షల నిధులతో అందంగా రూపొందించారు. 2022లో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించి 2023 జూన్‌లో పూర్తి చేశారు. ఆడారి ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు నిర్వహించి శిఖర ప్రతిష్టా మహోత్సవ వేడుకలు జరిపారు. నాటి కార్యక్రమం ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ప్రత్యేక పూజల నేపథ్యంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్, ఆలయ ఈవో డి.సురేష్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయాభివృద్ధికి దాత ఆడారి ఆనంద్‌కుమార్ ఇచ్చిన రూ. 33 లక్షలతో చేపట్టిన పనులు

నిర్మాణ పనులు	ఖర్చు
గోపుర నిర్మాణం	రూ.10.5 లక్షలు
మండప నిర్మాణం	రూ.6.2 లక్షలు
పుట్టబంగారం మండపం	రూ.2.4 లక్షలు
గర్భ గుడి తలుపులు	రూ.1.5 లక్షలు
మండపానికి ఎస్ఎస్ గ్రిల్స్	రూ.2.5 లక్షలు
ఫ్లోర్, వాల్ టైల్స్	రూ.3.5 లక్షలు
క్యూలైన్ గేట్లు	రూ.1.8 లక్షలు
ఆలయానికి రంగులు	రూ. 3.2 లక్షలు
తలనీలాల షెడ్, విశ్రాంతి గది	రూ.1.4 లక్షలు

అభివృద్ధి తర్వాత ఆలయం బాగుంది..



ఎర్నిమాంబ అమ్మవారు మా ఇంటి ఇలవేల్పు. అమ్మవారి ఆలయం ఇటీవల కొత్తకళ సంతరించుకుంది. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులు వెచ్చించి అమ్మవారి ఆలయాన్ని తీర్చిదిద్దడం సంతోషకరం. ఇప్పుడు ఆలయంలో సదుపాయాలు భక్తులకు అనుగుణంగా ఉన్నాయి.

– పల్లా ఎర్నికుమార్, భక్తుడు, కంచరపాలెం

అభివృద్ధికి మరింత కృషి..

ఎర్నిమాంబ అమ్మవారి భక్తులకు పలు సదుపాయాలు కల్పించాం. నిధుల లభ్యతను బట్టి మరింతగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం. భక్తులు వంటా వార్పు చేసుకునేందుకు, భక్తుల క్యూలైన్ ఏర్పాటుకు టెండర్లు పిలిచాం.

– డి.సురేష్‌బాబా, ఎర్నిమాంబ ఆలయ ఈవో

సౌకర్యాలు పెరిగాయి..



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ అమ్మవారి పేరు కలిసొచ్చేలాగే పెడుతున్నారు. దయ గల తల్లి ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం గతంలో కంటే అభివృద్ధి చేసిన తర్వాత మరింత బాగుంది. భక్తుల సౌకర్యాలు పెరిగాయి. సొంత నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేసిన ఆనంద్‌కుమార్‌కు ధన్యవాదాలు.

– వాసుపల్లి విజయ,

ఘోషాస్పత్రిలో వైద్య సేవలపై ఆరా

మహారాణిపేట: వన్‌టౌన్‌లోని ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి(ఘోషాస్పత్రి)ని శనివారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సందర్శించారు. హైరిస్క్ పిల్లలు వార్డు, ఇతర వార్డులను పరిశీలించారు. వైద్యులు అందిస్తున్న సేవలపై బాలింతలు నుంచి వివరాలు సేకరించారు. బరువు తక్కువతో పుట్టిన పిల్లలపై ఎటువంటి వైద్య చికిత్సలు అందిస్తున్నారో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. లింగ నిర్ధారణ గోప్యత విషయంలో అమలు చేస్తున్న విధి విధానాలపై ఆరా తీశారు. సెక్యూరిటీ విధానాన్ని పరిశీలించారు. అలాగే జనన ధ్రువీకరణ పత్రాలు అందించే కార్యాలయాన్ని సందర్శించి.. పత్రాల్లో తప్పులు దొర్లితే చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో ఉల్లంఘనలు జరిగితే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

రాష్ట్రంలోని పలు పిల్లల ఆస్పత్రులపై ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేయనున్నట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ చైరపర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, ఆస్పత్రి ఆర్ఎంవోలు డాక్టర్ రాధారాణి, డాక్టర్ మెహర్, వైద్యులు గీతావందన, ఉప్పాడ జీవన్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



తాము కాపాడిన యువకుడితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో కొట్టు కుపోతున్న యువకుడిని లైఫ్‌గార్డ్స్ కాపాడా రు. వివరాలివీ.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురు యువకులు శనివారం సాయంత్రం రుషికొండ బీచ్ కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులందరూ సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో గౌరవ్ యాదవ్ కొట్టుకుని పోతుండగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ చందు, సూరాడ నూకరాజు, చిన్నప్పన్న గమనించారు. వెంటనే రంగంలోకి దిగి యువకుడిని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. మెరైన్ పోలీసులు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

జలవనరుల పరిరక్షణపై జాతీయ సదస్సు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 11,12 తేదీల్లో జలవనరుల పరిరక్షణ వ్యూహాలు–సుస్థిరత అనే అంశంపై జువాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. శనివారం కళాశాల సెమినార్ హాల్లో సదస్సు పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఆక్వా కల్చర్ సాంకేతికతలో కొనసాగుతున్న పురోగతి, పెట్టుబడి అవకాశాలు, ఆక్వా కల్చర్‌లో సహకార రంగాలను గుర్తించడం ఈ సదస్సు లక్ష్యమని కన్వీనర్ డాక్టర్ హరిణి తెలిపారు. సదస్సులో పాల్గొనే ఔత్సాహికులు 9393917880 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.కె.జయలక్ష్మి, స్నేహ, రోజిన జార్జ్, భాస్కర సుధ, అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

30వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం శనివారం 30వ వార్డు అఫీషియల్ కాలనీ సచివాలయ పరిధి బెల్లం వినాయక దేవాలయం ప్రాంతంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు. మండల అధ్యక్షుడు పీతల వాసు, వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పెంటపల్లి సత్యనారాయణ, వడ్డాది దిలీప్, దశమంతుల చిన్ని, రాము, మణి, కోన తిరుమల, దశమంతుల రామలక్ష్మి, సారిపిల్లి అప్పలరాజు, ఆకుల శ్యామ్, రెడ్డి జగన్, కోరాడ సురేష్, వార్డు ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అట్టహాసంగా పాలగొలుపు మహోత్సవం



పాలగొలుపు మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి, సీరపు ఆదినారాయణరెడ్డి సేవా గరిడీ ఆధ్వర్యంలో పాలగొలుపు మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పిలుపు మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరయ్యారు. సేవా గరిడీ నిర్వాహకులు తోడపెద్దును అలంకరించి గరిడీతో సింహాద్రి అప్పనను ఆరాధించారు. దొండపర్తి గ్రామంలో తిరువీధి నిర్వహించారు. ప్రతి కార్తీకమాసంలో ఈ వేడుక ఘనంగా జరుగుతుందని వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. సింహాచల అప్పన్న ప్రళయాలు, విపత్తుల నుంచి విశాఖను రక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సేవా గరిడీ ప్రతినిధులు, 36వ వార్డు నాయకులు మాసిపోగురాజు, అజయ్‌రెడ్డి, మధు, గురుమూర్తి, అశోక్, అంగటికుమార్, సతీష్, ఆదినారాయణరెడ్డి, బాబు, ఆశ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఆరుగురి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితులు

అల్లిపురం : గంజాయి రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు మహిళలతో సహా ఆరుగురుని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్రుడు ఆదేశాల మేరకు శుక్రవారం టాస్క్ ఫోర్సు ఏసీపీ త్రినాథ్‌రావు తన సిబ్బందితో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 3 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గంజాయి రవాణా జరుగుతుందని తెలిసిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇద్దరు మహిళలు సహా నలుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 18 కేజీల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



34వ వార్డులో ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: శనివారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. జీవీఎంసీ 30వ వార్డులో గుర్రాల అప్పలరాజు, 31వ వార్డులో దొడ్డి అప్పన్న, బల్లంకి శ్రీను, 34వ వార్డులో కంబాల నూకరాజు, 36వ వార్డులో వంగలపూడి మహవీర్, దాసరి ఈశ్వరరావు, 37వ వార్డులో పిరద సర్వేంద్ర, 38వ వార్డులో వాడమొదుల సింహాద్రి, దొలపల్లి ఎల్లయ్యకు తదితరులకు రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ అందించిన ఆరోగ్యశ్రీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మరింత చేరువ చేశారన్నారు. అటువంటి గొప్ప నేతను గెలిపించుకునేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పలువురు డైరెక్టర్లు, పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులు, పలు ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



సభ్యులతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : గరుడా జగన్నాయకుల సత్రం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ధర్మకర్తల మండలిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్నాయకుల వారి సత్రం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేయడమంటే పూర్వజన్మ సుకృతమని అభిప్రాయపడ్డారు. స్వామి ఆశీస్సులు సభ్యులపై, విశాఖ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ధర్మకర్తలుగా కడియం ప్రసాద్, గొరుసు నాగేశ్వరరెడ్డి, కేతవరపు స్వాతి, పోలవరపు రవణమ్మ, టి. శ్రీనివాసరావు, చరకం మణి, దువ్వాడ రమణిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సభ్యులందరూ కడియం ప్రసాద్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, మండల అధ్యక్షుడు పీతల వాసు, పలు ఆలయాల చైర్మన్లు నాయని మల్లిబాబు, టీకే ప్రసాద్, పార్టీ నాయకులు అలపన కనకరెడ్డి, ఆదివిష్ణు, ఖాజావలి, ముజీబ్‌ఖాన్, బోని దేవా పాల్గొన్నారు.

హార్బర్ పోలీస్‌స్టేషన్ సందర్శన

మురళీనగర్ : పోలీసు స్టేషన్ పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని విశాఖపట్నం డీసీపీ–2 (ఎల్‌వో) కె.ఆనందరెడ్డి సూచించారు. నగరంలోని హార్బర్ స్టేషన్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోర్టు ఏరియాతో పాటు స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, క్రై మ్, ట్రాఫిక్‌పై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. విధుల నిర్వహణలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైల్వే జోన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు

దొండపర్తి: విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. విశాఖ పర్యటనలో ఉన్న రైల్వే మంత్రిని ఛాంబర్స్ ప్రతినిధులు శనివారం కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రైలు నెట్‌వర్క్ అభివృద్ధికి, రైలు కనెక్టివిటీని మెరుగుపరచడానికి ఈ కొత్త జోన్ కీలకమైందని పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితమే జోన్‌ను మంజూరు చేసినప్పటికీ.. ఇప్పటి వరకు ఆ ప్రక్రియను ప్రారంభించలేదని గుర్తు చేశారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

డాబాగార్డెన్స్ : క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని వర్క్ అకౌంట్స్ (ఫైనాన్స్) జాయింట్ డైరెక్టర్ పి. శ్రీరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ శాఖలో పని చేస్తున్న విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఉద్యోగులకు పలు ఇండోర్, ఔట్‌డోర్ గేమ్స్ నిర్వహించారు.